'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ
ఈసీ తాఖీదులు

ఎన్నికల ఉపన్యాసాల్లో ఎంతోకొంత 'అతి' ఉంటుందనేది అందరూ అంగీకరించే విషయమే. కానీ, అవి శృతిమించి పాకాన పడితే ప్రజాస్వామిక స్ఫూర్తి దెబ్బతింటుంది. ఓట్లు రాబట్టుకునేందుకు పార్టీలు రకరకాల ఎత్తుగడలను అనుసరిస్తాయి. అయితే ఆ ఎత్తుగడలు కులపరంగా, మతపరంగా ప్రజలను చీల్చడం, ప్రత్యర్థులపై అసత్య ప్రచారాలకు పాల్పడటం వంటి అనామోదయోగ్య చర్యలుగా దిగజారితే ప్రమాదం. అలా జరుగకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం మీద ఉంటుంది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సీజన్‌లో కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీల ఓట్ల వ్యూహం శ్రుతిమించి పాకాన పడుతుండటం మనం చూస్తున్నాం. ప్రస్తుత ఎన్నికల సంవాదంలో అభివృద్ధి ఎజెండా మృగ్యమైపోవడం ఓ విషాదం. ప్రజాసమస్యల ప్రస్తావన లేకుండా కేవలం భావావేశాలు రెచ్చగొట్టడం మీదనే జాతీయ పార్టీలు ఆశలు పెట్టుకున్నట్టు కనిపిస్తున్నది. బీజేపీ మతపరమైన సెంటిమెంట్‌ను వాడుకుంటున్నదని, పోటీగా కాంగ్రెస్ కులపరమైన ఆవేశాలు రెచ్చగొడుతున్నదనే ఆరోపణలు వస్తుండటం తెలిసిందే.

ఈ పరిస్థితి ఇలా ఉంటే నిష్పాక్షిక మధ్యవర్తిత్వంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం పారదర్శకత, విశ్వసనీయత అనేక వివిధానేక కారణాల వల్ల సందేహాస్పదం అవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ వివాదాస్పద వ్యాఖ్యలపై సత్వరం స్పందించకపోవడం, బీజేపీ విషయంలో చూసీచూడనట్టు పోవడం, బీజేపీయేతర పార్టీలపై చిన్నాచితకా విషయాలకు ప్రచార నిషేధాలు విధించడం విమర్శలకు తావిచ్చింది. ఎన్నికల ప్రసంగాల స్థాయి దిగజారడంపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో జాతీయ ప్రధాన రాజకీయ పక్షాలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు ఎన్నికల సంఘం తాజాగా పది సూత్రాలతో కూడిన కఠినమైన ఆదేశాలు జారీచేసింది. భారతీయ సామాజిక-సాంస్కృతిక వైవిధ్యం కాలపరీక్షకు తట్టుకొని నిలిచిందని, దానిని ఎన్నికల కోసం బలిపశువును చేయవద్దని హితవు పలకడం విశేషం. భారతీయ ఎన్నికల సాంప్రదాయాలపై రెండు పార్టీలు రాజీపడొద్దని తేల్చిచెప్పింది. బహిరంగ ఉపన్యాసాల్లో మర్యాదలు పాటించాలని, జాగ్రత్తలు తీసుకోవాలని తమతమ ప్రచారకర్తలకు అధికారికంగా ఆదేశాలు జారీచేయాలని కూడా సూచించింది. ఇలాంటివే మొత్తం పది అంశాలను ఈసీ తన ఉత్తర్వుల్లో ప్రస్తావించింది.

ప్రధాన పక్షాలకు ఈ తరహా హెచ్చరికలు జారీచేయడం భారతీయ ఎన్నికల చరిత్రలో అసాధారణమే. ఆ సంగతి ఈసీ తన ఆదేశాల్లో కూడా ప్రస్తావించింది. కాకపోతే ప్రచారాల తీరు పతనావస్థకు చేరుకున్న తర్వాత చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా ఈసీ చాలా ఆలస్యంగా మేలుకోవడమే అసలు సమస్య. ఏడు విడతల ఎన్నికల సీజన్‌లో ఐదు విడతలు పూర్తయిన తర్వాత ఈసీ ఈ ఆదేశాలు జారీ చేయడం ఏమిటనే ప్రశ్న ఉదయిస్తున్నది. బీజేపీ తన ప్రచారంలో మతపరమైన అంశాల జోలికి వెళ్లకూడదని, రాజ్యాంగం రద్దయిపోతుందనే ప్రచారం కాంగ్రెస్ మానుకోవాలని ఈసీ తన ఉత్తర్వుల్లో హెచ్చరించింది. ఎన్నికల్లో సరైన పద్ధతులు పాటించడం విషయంలో పాలక పక్షానికి అదనపు బాధ్యతలు ఉంటాయని గుర్తుచేసింది. కానీ, ఇప్పటిదాకా జరిగిన ఘోరమైన ఉల్లంఘనల మాటేమిటి? వాటిపై స్పందనలు, చర్యలు పెద్దగా ఉంటాయని భావించే పరిస్థితులు ప్రస్తుతం కనిపించడం లేదు. ఈ తరహా అపనమ్మకాన్ని తొలగించేందుకు ఈసీ నిర్మొహమాటంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కావాల్సింది కఠినమైన హెచ్చరికలు కాదు, కఠినమైన చర్యలు. లేకపోతే బాహాటంగా ఉల్లంఘనలు జరుగుతుంటే ఈసీ చూస్తూ కూర్చున్నదనే విమర్శలను తప్పించుకునేందుకు జరిపిన మొక్కుబడి ప్రయత్నంగానే ప్రస్తుత ఉత్తర్వులను చూడాల్సి వస్తుంది.

కారణజన్ముడు కారుణ్య ముని

నేడు బుద్ధ పూర్ణిమ

క్రీ.పూ.623వ సంవత్సరంలో ఇప్పటి నేపాలలోని లుంబినిలో ఒక రాజ కుటుంబంలో బుద్ధుడు జన్మించారు. కానీ ఆయన రాజు గానీ, చక్రవర్తి గానీ కాలేదు. ఒక గొప్ప తథాగత బుద్ధుడుగా ప్రపంచ దృష్టిని ఆకర్షించారు.

బుద్ధుడు తన పూర్తి తాత్విక బోధనలన్నింటిలోనూ దైవ ప్రసక్తి లేకుండా దైవాన్ని నిరాకరించి ఆ చోట సత్యానికి ప్రాధాన్యాన్నిచ్చారు. దుఃఖానికి కారణం కోరిక అని, మనిషికి కోరిక ఉండకూడదనే భావరాహిత్య ఆవశ్యకతను వివరించారు.

గౌతమ శాక్యమౌని తన బోధనల్లో ప్రజ్ఞ, కరుణ, శీలం అనే మూడు గుణాలు మానవున్ని ఉదాత్త స్థాయికి తీసుకువెళ్తాయని పేర్కొంటారు. కరుణ లేని ప్రజ్ఞ వ్యర్థం, ప్రజ్ఞ లేని శీలం దుర్బలం. ఈ మూడు ఉన్నప్పుడే మానవుడు బుద్ధత్వాన్ని చేరుకుంటాడు. కరుణార్ద్ర హృదయం లేని ప్రజ్ఞ నిస్సారమైనదని బౌద్ధం చెప్తుంది. అసలు బుద్ధత్వం అంటే రెండు రకాల జ్ఞానాల పతనం జరుగుతుంది. అందులో ఒకటి బయటి వస్తువు. రెండవది లోపలి వస్తువు. ఈ రెండూ ఉండని స్థితియే బుద్ధత్వం.

డాక్టర్ సీహెచ్ వంశీధర్
90002 00088

బౌద్ధం జ్ఞానం కన్నా ప్రజ్ఞకు ఎక్కువ ప్రాముఖ్యాన్నిస్తుంది. జ్ఞానం విశ్వవిద్యాలయాల్లో విస్తారంగా దొరకవచ్చు కానీ ప్రజ్ఞను నీలో నీవే తెలుసుకోవాలి. ప్రజ్ఞ నీ స్మృతిలో నిలిచినప్పుడు ఆనందం. అంటే నీ స్మృతిలో నువ్వే ప్రశాంతంగా ఉండటం. అదే బుద్ధత్వం. జ్ఞానం గతానికి సంబంధించింది, ప్రజ్ఞ వర్తమానానికి సంబంధించింది. ఈ తేడాను తెలుసుకుంటే బుద్ధుని మార్గంలో ఉన్నట్టు. ఇది గురుశిష్యుల మధ్య మహా మౌనంగా ప్రసరిస్తూ ఉంటుంది. అది గురువు ఇచ్చేది కాదు. కానీ, శిష్యుడు స్వీకరించేది.

బౌద్ధం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు అత్యున్నత విలువ నిచ్చింది. కుల, మత రహిత సమ సమాజ స్థాపనకు పూనుకొని దాన్ని ఆచరణలో పెట్టి భారతదేశ సమాజానికి ఆదర్శప్రాయంగా నిలబడింది. బౌద్ధంలో స్త్రీకి అత్యున్నతమైన విలువ, గౌరవం, స్వేచ్ఛను కల్పించింది. ఇలాంటి బౌద్ధం భారతదేశ సమాజానికే కాదు యావత్ ప్రపంచ వర్తమాన, భవిష్యత్తుకు ఒక గొప్ప దార్శనికంగా ఆదర్శప్రాయంగా ఉంటుంది.

(వ్యాసకర్త: అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫిలాసఫీ, ఓయూ)

విద్రోహం ఓడిపోయిన రోజు జూన్ 2

2024, జూన్ 2 తెలంగాణకు ఒక మైలురాయి. అరవై ఏండ్ల విద్రోహ రాజకీయాలను ఓడించిన రోజు. తెలంగాణ ఆవిర్భవించి పదేండ్లు గడిచాయి. హైదరాబాద్ నగరం పదేండ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉండాలని విభజన చట్టంలో ఒక క్లాజును ఇరికించారు. ఏనాటికైనా తెలంగాణ రాష్ట్రం రద్దు కాకపోదా లేదా హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతం కాకపోదా అన్న దు(దూ)రాలోచనతోనే విభజన చట్టంలో ఈ క్లాజును చేర్చినారని ఆనాడే ఉద్యమకారులు విశ్లేషించారు.

జూన్ 2న ఈ క్లాజుకు కాలం చెల్లుతుంది. హైదరాబాద్ నగరం పూర్తిగా, చట్టబద్ధంగా తెలంగాణ రాష్ట్ర రాజధానిగానే ఉంటుంది. హైదరాబాద్ నగర పాలనపై గవర్నర్‌కు ఉన్న ప్రత్యేకాధికారాలు కూడా రద్దయిపోతాయి. ఈ శుభ సందర్భంలో విద్రోహ రాజకీయాల చరిత్రను, ఉద్యమ చరిత్రను సమీక్షించుకోవడం ఆసక్తికరంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

శ్రీధరరావు దేశ్‌పాండే

విద్రోహ రాజకీయాలు విజయం పొందిన రోజు 1956, నవంబర్ 1: మద్రాస్ నుంచి విడిపోయి కర్నూల్ రాజధానిగా 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకావడం, ఫజల్ అలీ కమిషన్ సిఫారసులకు విరుద్ధంగా తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను విలీనం చేసి 1956, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకావడం అందరికీ తెలిసిన చరిత్రే. 2014లో రాష్ట్ర విభజన తర్వాత అక్టోబర్ 1 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినంగా మారింది. తెలంగాణ ప్రజలు మాత్రం అప్పటిదాకా విద్రోహ దినంగా పాటిస్తున్న నవంబరు 1ని పూర్తిగా మరచిపోయారు. ఈ పదేండ్లలో ఎన్నడూ నవంబర్ 1ని తలుచుకున్నది లేదు. ఆ రోజు అన్నిసాధారణ రోజుల్లాగే గడవిపోయింది. ఉద్యమ కాలంలో నవంబర్ 1ని విద్రోహ దినంగా జరపడంపై ఆంధ్ర ప్రాంత మేధావులు అభ్యంతరాలు వ్యక్తంచేసేవారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్రోహం వల్ల ఏర్పడింది కాదని, హైదరాబాద్ రాష్ట్ర శాసనసభ తీర్మానం మేరకే విలీనం జరిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైందని వారు వాదించేవారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు ముమ్మాటికీ విద్రోహ రాజకీయాల ఫలితంగా ఏర్పడిందన్నది తొలినాళ్ల నుంచే తెలంగాణ ప్రజల మనోగతం. అదే వాస్తవం కూడా. ఫజల్ అలీ కమీషన్ ముందు విశాలాంధ్ర ఏర్పాటును వ్యతిరేకిస్తూ తెలంగాణ నాయకులు, ప్రజాసంఘాలు తమ అనుమానాలను, భయాందోళనలను వివరిస్తూ వందలాది వినతిపత్రాలను సమర్పించారు. కమీషన్ చాలా నిజాయితీగా వాటన్నింటిని రికార్డు చేయడమే కాకుండా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు విడివిడిగా కొనసాగాలని విస్పష్టమైన సిఫారసులను చేసింది. హైదరాబాద్ రాష్ట్రానికి సంబంధించి కమీషన్ రెండు సిఫారసులను చేసింది. మొదటిది- హైదరాబాద్ రాష్ట్రాన్ని విభజించి మరాఠి మాట్లాడే మరాఠ్వాడా జిల్లాలను మహారాష్ట్రలో (అప్పటికింకా బొంబాయి రాష్ట్రమే), కన్నడ మాట్లాడే జిల్లాలను కర్ణాటక రాష్ట్రంలో కలపాలి. రెండోది- మిగిలిన తెలుగు మాట్లాడే తెలంగాణ జిల్లాలను విడిగా హైదరాబాద్ రాష్ట్రంగా కొనసాగించాలి. ఇట్లా అంటూనే ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల విలీనమే అనివార్యమైతే 1961లోనో, ఆ తర్వాతనో జరిగే సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడే హైదరాబాద్ శాసనసభలో (ఇక్కడ కమీషన్ Residuary Hyderabad State అన్న పదాన్ని వాడిందన్న సంగతిని గమనించాలి.) మూడింట రెండు వంతుల సభ్యుల మద్దతుంటే విలీనం చెయ్యాలని, లేకుంటే ఆంధ్ర, తెలంగాణ విడివిడిగా కొనసాగాలని కమిషన్ సిఫారసు చేసింది.

ఫజల్ అలీ కమిషన్ చేసిన ఈ సిఫారసు విజ్ఞతతో చేసినదని చెప్పాలి. ఎందుకంటే, పాత హైదరాబాద్ శాసనసభలో మరాట్వాడా, కర్ణాటక శాసనసభ్యులు హైదరాబాద్ రాష్ట్ర విభజనకు అనుకూలంగా ఉండేవారు. పాత హైదరాబాద్ శాసనసభ ప్రకటించే అభిప్రాయం తెలంగాణ ప్రజల అభిప్రాయం కాజాలదు. కాబట్టి 1961లో తెలంగాణ జిల్లాలతో మాత్రమే ఏర్పడే శాసనసభ తీర్మానం ద్వారానే విలీనం జరగాలన్నది వారి అభిమతం. అది మాత్రమే తెలంగాణ ప్రజల మనోభావాలను వెల్లడిస్తుందని వారి అభిప్రాయంగా కనిపిస్తున్నది. తెలంగాణ ప్రజలు విలీనానికి అనుకూలంగా ఉండి ఉంటే అది 1961లోనూ వెల్లడయ్యేది. మరి ఆంధ్రులు 1961 దాకా ఆగకుండా 1956లోనే విలీనాన్ని ఎందుకు సంభవింపజేశారు? తెలంగాణ ప్రజల మీద ఆంధ్ర నాయకులకు అవిశ్వాసం ఎంతటిదో తెలుసుకునేందుకు ఫజల్ అలీ నివేదికపై వారి వ్యాఖానాలే నిదర్శనం. నాటి ఆంధ్రపత్రిక ఈ వ్యాఖ్యానాలను రికార్డు చేసింది. ఆంధ్ర నాయకులు విలీనానికి ఎందుకు ఆతృతపడ్డారో ఆంధ్ర అసెంబ్లీలో వారి ప్రసంగాల్లో స్పష్టంగా వ్యక్తమైంది.

> 'విలీనం వాయిదా పడితే ఇక విశాలాంధ్ర ఎన్నటికీ రాదు. ఆరేళ్లు ఆగడం చాలా ప్రమాదకరం. 1961 నాటికి ప్రత్యేక రాష్ట్ర వాంఛ ఇంకా బలపడుతుంది. విశాలాంధ్రకు అప్పుడు ఒప్పుకోరు. 2/3 మెజారిటీ విశాలాంధ్రకు వచ్చుట కష్టం.'
> – అయ్యదేవర కాళేశ్వరరావు
> 'విశాలాంధ్ర ఇప్పుడు తప్పితే ఇక రాదు.
> – నీలం సంజీవరెడ్డి
> 'విశాలాంధ్ర ఈనాడు ఏర్పడకపోతే అసంభవం కావచ్చునేమో'
> – వావిలాల గోపాలకృష్ణయ్య

1961 దాకా ఆగితే అప్పటికే బలంగా ఉన్న ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మరింత బలపడుతుందన్న ఆలోచనతో వారు ఢిల్లీకి పరుగులు తీసి కేంద్ర నాయకత్వంతో తమకున్న పరిచయాలతో లాబీయింగ్ చేసి విశాలాంధ్రను వ్యతిరేకించిన ప్రధాని నెహ్రూను లొంగదీసుకోగలిగారు. తెలంగాణ రాష్ట్రవాదిగా ఉండిన హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావును ఏ ప్రలోభాలకు గురిచేశారో గాని విశాలాంధ్ర వాదిగా మార్చివేశారు.

ప్రత్యేక రాష్ట్రవాదులుగా ఉన్న కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి తదితరులను తెలంగాణకు రక్షణలు కల్పిస్తామని హామీ ఇచ్చి లొంగదీసుకున్నారు. వీరిచే పెద్ద మనుషుల ఒప్పందంపై సంతకాలు చేయించారు. మరాట్వాడా, కన్నడ ప్రాంత శాసనసభ్యుల మద్దతుతో హైదరాబాద్ రాష్ట్ర శాసనసభలో తీర్మానాన్ని ఆమోదింపజేసుకోవడంతో (నిజానికి ఇటువంటి తీర్మానం ఏదీ జరుగలేదని, కేవలం శాసనసభలో చర్చ మాత్రమే జరిగిందని ప్రొ.జయశంకర్ గారు ఈ వ్యాస రచయితతో చెప్పారు. నిజనిజాలు తేల్చడానికి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభలో జరిగిన చర్చల రికార్డులను మాయం చేశారు.) అంతిమంగా వారు నెరిపిన విద్రోహ రాజకీయాలు సఫలమయ్యాయి. ఈ విద్రోహ రాజకీయాలకు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్న గోసాయి స్వామీ రామానంద తీర్థ ప్రోత్సాహాన్నిచ్చారని ఆనాటి ఉద్యమకారులు అభిప్రాయపడేవారు. ఆయన కన్నడ ప్రాంతవాసి. హైదరాబాద్ రాష్ట్రం విభజన అయితేనే మరాట్వాడా, కన్నడ జిల్లాలు తమ తమ మాతృ భాషా ప్రాంతాలతో విలీనానికి అవకాశం ఏర్పడుతుందని భావించి హైదరాబాద్ రాష్ట్ర విభజనకు మద్దతునిస్తూనే విశాలాంధ్ర ఏర్పాటుకు కూడా ప్రోత్సాహం అందించాడు. హైదరాబాద్ రాష్ట్ర శాసనసభలో హైదరాబాద్ రాష్ట్ర విభజనకు, విశాలాంధ్ర ఏర్పాటుకు అనుకూలంగా తీర్మానాన్ని ఆమోదించడంలో ఈ గోసాయిదే కీలక పాత్ర అని తెలంగాణ తొలి దశ ఉద్యమకారులు అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు. తెలంగాణ ప్రజల అభీష్టానికి విరుద్ధంగా, ఫజల్ అలీ సిఫారసులకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడటం విద్రోహం కాక మరేమవుతుంది?

(ఇంకా ఉంది)

వుయ్ వాంట్.. యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్!

తాను తీసుకొచ్చిన ఓ గొప్ప ఆవిష్కరణ పక్కదారిపట్టి మానవాళికి కొత్త కష్టాలను తీసుకొస్తుంటే.. ఏ శాస్త్రవేత్త కూడా భరించలేడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమమేధ-ఏఐ) పితామహుడు జాఫ్రీ హింటన్ దీనికి మినహాయింపేమీ కాదు. అది 1888వ సంవత్సరం. ఏప్రిల్ పదమూడో తేదీ. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ తన సోదరుడు మరణించిన బాధలో ఉన్నారు. అంతలో అతని సహాయకుడు ఆరోజు ఫ్రెంచ్ పత్రికలన్నింటినీ పట్టుకొచ్చి చూపించాడు. అందులో 'ప్రజల చావులతో వ్యాపారం చేసిన బిజినెస్‌మ్యాన్ చనిపోయాడు' అని రాసి ఉంది. సోదరుడు చనిపోతే, తాను చనిపోయినట్టు పొరబడిన పత్రికలు అలా రాశాయని తెలుసుకోవడానికి ఆల్‌ఫ్రెడ్‌కు ఎంతో సమయం పట్టలేదు. అయితే, ఆ వార్తల్లోని ఒక్కో అక్షరం చదువుతుంటే అతని కండ్లు చెమ్మగిల్లాయి.

కడవేర్గు రాజశేఖర్

'నిర్మాణ రంగం, గనుల తవ్వకాల కోసమని తాను కనిపెట్టిన డైనమైట్.. చివరకు మానవాళి వినాశనానికి, యుద్ధాలకు కారణమవుతున్నది కదా!' అని అర్థం చేసుకొన్న ఆల్‌ఫ్రెడ్ అప్పుడే ఓ దృఢ నిర్ణయం తీసుకున్నారు. మానవాళికి ఉపయుక్తంగా ఉండే ఆవిష్కరణలకు పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ ప్రైజ్ ప్రారంభం కావడం వెనుక దాగిఉన్న కథ ఇది.

సాంకేతిక రంగంలో ఏఐ ఎంతటి సంచలనాలను సృష్టిస్తున్నదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే ఏఐతో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో.. అదేస్థాయిలో ప్రతికూలతలూ ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడి నుంచి సినీ నటుల వరకు ఏఐ డీప్‌ఫేక్‌ల బారినపడి ఇబ్బందులు పడినవారే. ఏఐ కారణంగా లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు కూడా. ఏఐ సాంకేతికతలో వస్తున్న నూతన ఒరవడులు 30 కోట్ల ఉద్యోగాలపై ప్రభావం చూపించవచ్చని అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ హెచ్చరించింది.

సామాన్యులను ఆదుకోవాలి: ఏఐ కారణంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతుండటంపై ఏఐ పితామహుడు డాక్టర్ జాఫ్రీ హింటన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ రాకతో కంపెనీలు లాభాల బాట పట్టి ధనికులు మరింత సంపన్నులుగా మారుతుండగా.. ఉద్యోగాలు కోల్పోయి సామాన్యులు రోడ్డున పడిపోయే దుస్థితి వాటిల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామం సమాజానికి ఏ మాత్రం మంచిదికాదని హెచ్చరించారు. అందుకే దేశాలన్నీ 'యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్' (యూబీఐ) పాలసీని తీసుకురావాలని ఆయన నొక్కిచెప్పారు.

మానవాళికే ముప్పు: బీబీసీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఏఐ సాంకేతికతపై జాఫ్రీ హింటన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కంపెనీల ఉత్పాదకత పెరిగి తద్వారా దేశాల ఆర్థిక స్థితిగతులు మెరుగవడానికి ఏఐ సాయపడుతుందని తొలుత సంతోషించా. అయితే, ఏఐ సాయంతో కంపెనీల యజమానులు మరింత సంపన్నులుగా మారుతున్నారు. అదే సమయంలో ఉద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఇది సమాజంలో అసమానతలకు కారణమవుతున్నది. వచ్చే 5-20 ఏండ్లలో మొత్తం ఉద్యోగాల్లో సగానికి పైగా ఏఐ సాంకేతికతే ఆక్రమిస్తుంది. ఏఐతో ఉద్యోగాలే కాదు, మానవాళికి కూడా ముప్పు పొంచి ఉన్నది. ఇది మన మేధస్సును దాటుకొని విస్తరించవచ్చు. తనకు తానుగా ఆలోచించే స్థాయికి ఏఐ చేరుకోవచ్చు. అదే జరిగితే, మానవాళి ఉనికే ప్రశ్నార్థకమవుతుంది' అని హింటన్ ఆందోళన వ్యక్తం చేశారు.

అప్పుడు నోబెల్.. ఇప్పుడు హింటన్: డైనమైట్ ఆవిష్కరణ ద్వారా ఆయుధాలు, ఆయిల్ తదితర వ్యాపారాలు చేసి విపరీతంగా లాభాలు గడించిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్.. చివరకు తన ఆవిష్కరణ మానవాళి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తుండటాన్ని చూసి చలించిపోయారు. తన సంపదలో మెజారిటీ భాగాన్ని పక్కన పెట్టిన ఆయన.. దాని మీద వచ్చే వడ్డీని నోబెల్ ప్రైజ్‌ల రూపేణా మానవాళికి అత్యంత మేలు చేసే ఆవిష్కర్తలకు పంచాల్సిందిగా వీలునామా రాశారు. తన ఆవిష్కరణల ద్వారా పురుడుపోసుకొన్న ఏఐ.. మనిషి ఉపాధినే మింగేసే స్థాయికి చేరుకోవడాన్ని భరించలేని హింటన్ ఏఐ వల్ల కలిగే ప్రమాదాలను ప్రపంచానికి తెలియజేయాలని భావిస్తున్నారు. అంతేకాకుండా 'యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్' పాలసీ కోసం యూకే, యూఎస్ ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నారు.

ఏమిటీ 'యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్'?: దేశంలోని వయోజనులందరికీ ప్రతీనెలా బ్యాంకు ఖాతాలో కనీస మొత్తంలో ప్రభుత్వం డబ్బును జమ చేయాలి. దీన్నే 'యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (యూబీఐ)'గా పిలుస్తున్నారు. పనులు చేయడానికి సామర్థ్యం, అర్హతలు ఉన్నప్పటికీ తగిన ఉద్యోగం దొరక్క బతకడానికి సరిపడా జీతం రానివారికి యూబీఐని ఇవ్వాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. 'వుయ్ వాంట్ యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్' అంటూ ఏఐ కారణంగా ఉద్యోగాలు పోగొట్టుకొన్న పలువురు ఇప్పటికే ఉద్యమాలు చేస్తున్నారు. అయితే, యూబీఐతో ఉత్పాదకత శక్తి తగ్గిపోతుందని, పనిచేసేవారు కూడా సోమరులుగా మారి దేశాల ఆర్థిక వ్యవస్థలే కుప్పకూలే ప్రమాదం రావొచ్చన్న విమర్శలూ ఉన్నాయి.

ఏఐ.. మనిషి కాదు: సత్య నాదెళ్ల

ఏఐ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా మారిందని, మనిషి చేసే పనులన్నీ ఏఐ ద్వారా చేయవచ్చునని వస్తున్న వార్తలను మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల తోసిపుచ్చారు. ఏఐ అనేది ఒక టూల్ మాత్రమేనని, దానిని మనుషులతో సమానంగా చూడొద్దని స్పష్టం చేశారు. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ టీవీతో మాట్లాడారు. 'సాధారణంగా మనుషుల గురించి మాట్లాడేటప్పుడు క్రియలు, నామవాచకాలను సూచిస్తారు. అయితే ఏఐ అనేది ఒక టూల్ మాత్రమేనని నేను నమ్ముతున్నా. ఈ సాఫ్ట్‌వేర్ ప్రదర్శించే సామర్థ్యాలు మానవ మేధస్సుకు సమానం కాదని మనం అర్థం చేసుకోవాలి. ఏఐకి చాలా తెలివితేటలున్నాయి. అయితే మనిషి తెలివితేటలకు అవి సాటిరావు' అని సత్య నాదెళ్ల పేర్కొన్నారు.

ప్రచారంలో దారితప్పారు!

వికసిత్ భారత్, 400 సీట్లు అని ప్రధాని మోదీ, బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారు. కానీ, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగం, పెరిగిన ధరలు, రైతాంగం సమస్యలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో మోదీ, బీజేపీ నాయకులు ఎప్పుడో ప్రచారంలో దారితప్పారు. ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయం. జూన్ 4న ఫలితాల రోజు వారికి వాస్తవం తెలిసొస్తుంది.

- సాగరిక ఘోష్, టీఎంసీ రాజ్యసభ సభ్యురాలు